ఎక్సైజ్ డి.సి. బాజ్జీరావుకు పదవీ విరమణ సత్కారం

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: జిల్లాలో అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా చేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన కె.వి.వి.ఎస్.బాజ్జీరావును జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సత్కరించి అభినందించారు. ఎక్సైజ్ అధికారులతో సమావేశం అనంతరం ఉప కమిషనర్‌గా పదవీ విరమణ చేస్తున్న బాజ్జీరావు 39 ఏళ్ల పాటు ఎక్సైజ్ శాఖలో వివిధ హోదాల్లో సేవలందించారు. ఈ జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా, సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌గా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

- ఆసుపత్రుల్లో జరిగే ప్రతి ప్రసవాన్ని నమోదు చేయాలి
- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజువారీగా జరుగుతున్న ప్రసవాలను నమోదుచేసి ఆయా ఆసుపత్రుల నుంచి ప్రతి రోజూ సమాచారం సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. అదే సమయంలో జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగిన గర్భస్రావాల సమాచారం కూడా వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఏప్రిల్ నెలకు సంబంధించి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల సమాచారాన్ని వెంటనే ఒక నివేదిక రూపంలో అందజేయాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో ప్రతిరోజూ ఎన్ని స్కానింగులు జరుగుతున్నాయనే అంశంపై కూడా నివేదిక ఇవ్వాలన్నారు. లింగనిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా స్కానింగ్ కేంద్రాల ద్వారా లింగనిర్ధారణ పరీక్షల సమాచారం తెలిసే అవకాశం లేకుండా చేపట్టిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లోనూ లింగనిర్ధారణ నమాచారం తెలియజేయడం జరగదనే బోర్డులు సందర్శకులకు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. స్కానింగ్ కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు ఆయా ఆసుపత్రులు వసూలుచేసే ఛార్జీల వివరాలతో కూడిన ధరల పట్టికను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించే ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఆయా రెవిన్యూ డివిజనల్ అధికారులు తనిఖీచేసిన నివేదిక ఇచ్చిన తర్వాతే వాటికి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జీవనరాణి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.కె.రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.ఎన్.సూర్యనారాయణ, ఆర్‌బిఎస్‌కె పి.ఓ. డా.బి.వి.బి. సుబ్రహ్మణ్యం, లింగ నిర్ధారణ చట్టం అమలు అధికారి ఆర్.అమ్మతకుమారి, డిసిహెచ్ఎస్ డా.ఎం.సత్యవతి, వైద్యాధికారి జి.వెంకటేష్, డిఐఎంఓ వి.దినకర్లి, ఎస్.ఓ. ఎం.ధర్మారావు, దిశ స్వేచ్ఛ ఎస్.ఐ. నరసింహారావు, ఆర్.డి.ఓ. కార్యాలయం ఏ.ఓ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయాలి

రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
సమగ్ర శిక్షా ద్వారా ఉపకరణాల పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దివ్యాంగులు, ప్రత్యేకావసరాలు గల పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని, విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. పాఠశాల విద్యాశాఖ - సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో సహిత విద్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు భారీ ఎత్తున ఉపకరణాల పంపిణీ కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. హియరింగ్ ఎయిడ్స్-35, కమోడ్‌తో కూడిన వీల్‌ఛైర్లు 13, టిఎల్ఎం ప్రైమరీ కిట్లు 11, సెకండరీ కిట్లు 10, రుచ్ ఎల్‌బోలు 2, ట్రైసిక్ సైకిల్స్ 2, రోలేటర్ అడల్ట్ 3, ఛైల్డ్ 2, ఫోల్డింగ్ వీల్‌ఛైర్లు 8, బ్యాటరీ ట్రైసైకిల్స్ 2, విభిన్న ప్రతిభావంతుల వీల్‌ఛైర్ 1 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవకాశాలు కల్పిస్తే దివ్యాంగులు కూడా ఇతరులతో సమానంగా ఉన్నత స్థానాలను సాధిస్తారని అన్నారు. గత ఏడాది సమగ్ర శిక్షా ద్వారా సుమారు రూ.1.20 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. విద్యావ్యవస్థలో పారదర్శకత, సంస్కరణల కోసం రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ ఎంతగానో కృషి కృషి చేస్తున్నారన్నారు డిఎస్సి ద్వారా సుమారు 16,000 మంది ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తున్నారని, వీటిలో 2,200 పోస్టులు స్పెషల్ టీచర్లవి తెలిపారు. డీఆర్ఓ మురళి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. సహిత విద్య అన్నది విశిష్ట పథకమని పేర్కొన్నారు. స్పెషల్ ఒలింపిక్స్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన అద్వ తోమిని, కె.సంతు, ఈనుమల యశ్వంత్, రాజాన అజయ్, కొప్పల విజయ్‌కుమార్, కోరేటి వి.సునీల్, బంగారునాయుడులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్షా ఏపిసి డాక్టర్ రామారావు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: అభివృద్ధి, సంక్షేమం రెండింటికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం రంగరాయపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని పలువురు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కొండంత అండగా కూటమి

విశాలాంధ్ర - రేగిడి: పేదలకు కొండంత అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. రేగిడి ఆమదాలవలస మండలం బూరాడ గ్రామంలో శనివారం పింఛన్లు పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అద్భుతంగా మాజీ సీఎం స్వర్గీయ ఎన్టీఆర్ నిలిస్తే ఆయన బాటలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పయనిస్తూ ఏపీని పేదరికంలేని రాష్ట్రంగా నిలిపేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దూబ ధర్మారావు, గురవాన నారాయణరావు, వావిలపల్లి నాగభూషణరావు, వి.అప్పారావు నాయుడు, జి.శ్రీనివాసరావు, చల్లా భుజంగరావు, కేత శంకర్, మజ్జి శ్రీను, జద్దు ఉషారాణి, కడగల నాగరాజు పాల్గొన్నారు.

4న వైసీపీ వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - గుర్ల: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు పొట్నూరు సన్యాసినాయుడు, గ్రామ అధ్యక్షులు కె.వి.సూర్యనారాయణ రాజు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు బెల్లాన బంగారునాయుడు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, అన్నారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు

మాట్లాడుతూ 4వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు చీపురుపల్లి ఆంజనేయపురం మామిడికాయల యార్డ్ దగ్గర నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి వినతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జమ్ము స్వామి నాయుడు, కెంగువ మధుసూదనరావు, కోట తిరుపతిరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, అట్టాడ రామకృష్ణ, తెల్ల వెంకటరమణ, అట్టాడ అప్పలరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: జూన్ 4న వైసీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతం చేయాలని చీపురుపల్లి నియోజకవర్గ స్థాయి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మీసాల వరహాల నాయుడు తదితరులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గం కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రతినిధులు

కరిమజ్జి శ్రీనివాసరావు నాయుడు, పలివాద రాజారావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దన్నాన జనార్దన, నియోజకవర్గం వాలంటీర్ విభాగం అధ్యక్షులు బెల్లాన త్రినాథ్ రావు, నియోజకవర్గ సాంస్కృతిక విభాగ అధ్యక్షులు ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద్), మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విద్యా రంగాన్ని పూర్తిగా విధ్వంసం చేస్తుందని మంత్రి నిర్వాకం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం అన్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఏప్రిల్‌లో విడుదల చేశారు, ఈ ఫలితాల్లో చాలామంది విద్యార్థులు ఫెయిల్ అవ్వడంతో పాటు మార్కులు కూడా తక్కువగా వచ్చాయని ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. పది పరీక్షలు పూర్తయిన 22 రోజులకే ఫలితాలు విడుదల చేశామని నారా లోకేష్ ఆర్భాటం చేశారు తప్ప సరైన విద్యార్థులకు సరైన రిజల్ట్ ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 66,363 మంది విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు అప్లై చేసుకున్నారని, అందులో ఇప్పటికే 11,000 మంది పైబడిన విద్యార్థులు ఫెయిల్ అయిన వాళ్లు పాసయ్యారన్నారు. ముఖ్యంగా మార్కులు శాతం కూడా పెరిగిందని, చాలామంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు కూడా కోల్పోయారన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వి.గోర శంకర్, పట్టణ కార్యదర్శి ఏ.సుమన్, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం సిండికేట్‌ల జేబులు నింపుతున్న ప్రభుత్వం

నిబంధనలు పాటించని మద్యం షాప్ యాజమాన్యాలు
ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పన్న

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నూతన మద్యం పాలసీతో మద్యం సిండికేట్‌దారులకు జేబులు నింపుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న అన్నారు. మద్యం షాప్ యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి వారి ఇష్టానుసారం బార్ షాపులకు, రెస్టారెంట్లకు, బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ సిండికేట్‌గా ఏర్పడి జేబులు నింపుకుంటున్నారన్నారు. బెల్ట్ షాపులను నియంత్రించవలసిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని దీనినే ఆసరాగా తీసుకొని మద్యం షాప్ యాజమాన్యాలు మంచి బ్రాండ్లను ఎక్కువ ధరలకు బార్ షాపులకు విక్రయిస్తున్నారన్నారు. బహిరంగంగానే బార్ షాపుల్లో మద్యం బాటిల్‌పై అదనంగా 60 రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. సమయపాలన పాటించకుండా 24 గంటలూ కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.తులసి రామ్ పాల్గొన్నారు.

భారీ వర్షాలను సమర్థంగా ఎదుర్కోవాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనడానికి యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని నెల్లిమర్ల తహశీల్దారు సుదర్శనరావు ఆదేశించారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి మూడు రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. ముంపు పల్లె ప్రాంతాల్లోని అన్ని రోడ్లు, డ్రైనేజీ పరిశీలించాలని, లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజన్‌లో మలేరియా, డెంగీ, విష జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, దానిపై దృష్టి పెట్టాలని సూచించారు.

గొల్లవాని వలసలో ఏనుగుల గుంపు

విశాలాంధ్ర - వంగర: మండలంలో వీవీఆర్ పేట సమీపాన పక్క గ్రామంలో ఏనుగుల గుంపుతో ఈ గ్రామ ప్రజల్లో ఆందోళన మొదలైంది. గతంలో వీవీ ఆర్ పేట, రాజులగుమ్మడ, తలగాం, సంగాం, మగ్గూరు ఓని అగ్రహారం, మద్దువలస తదితర గ్రామాల్లో ఏనుగులు చొరబడి పంటలను ధ్వంసం చేశాయి.

దీంతో ప్రస్తుతం మండలంకు ఆనుకొని ఉన్న గొల్లవలస పక్క గొల్లవాని వలస గ్రామంలో గజరాజులు మన్యం పార్వతీపురం జిల్లా నుండి వచ్చి ఉండటంతో ప్రస్తుతం పంట పొలాల్లో ఉన్న నువ్వు, మినుము తదితర పంటలను ధ్వంసం అవుతాయేమోనన్న ఆందోళన కాకుండా గ్రామాల్లోకి ఏ అర్ధరాత్రి వస్తాయోనన్న భయం గుప్పెట్లో బతక వలసి ఉంటుందని వీవీ ఆర్ పేట గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కష్టపడి పండించిన పంటలు ఏనుగులు ధ్వంసం చేస్తాయేమోనన్న భయంతో కొట్టుమిట్టాడు తున్నారు. అధికారులు ఏనుగులు తరలిస్తే తప్ప ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

5న చలో విజయవాడ

విశాలాంధ్ర - తెర్లాం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ, రాంబాబు, తెర్లాం శాఖ ప్రధాన కార్యదర్శి బేగం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 5వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ప్రధాన సమస్యలపై వినతి అందించనున్నట్లు చెప్పారు.

పథకాల అమలులో కూటమి ముందంజ

రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి

విశాలాంధ్ర - జామి: రాష్ట్రంలో పేదలకు అందజేసే సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని, అందులో భాగంగా ఈనెల పింఛన్లు ఒక్కరోజు ముందుగా ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని రామయ్యపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారుల అనేక ఇబ్బందులు పడతారని, వారి గౌరవానికి భంగం కలగకూడదని భావించి పింఛన్లను ముందుగా ఇవ్వడం జరిగిందన్నారు.

బీసీ బాలుర వసతిగృహం సందర్శన

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని గజపతినగరం న్యాయస్థానం మెజిస్ట్రేట్ ఏ.విజయ్ కుమార్ శనివారం పరిశీలించారు. పాఠశాలలో పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థి వసతి సముదాయాలు, మరుగుదొడ్లు, త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని వారిని కోరారు. మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జయంతి, వార్డెన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మెంటాడ మండలం కుంటినవలస గ్రామంలో హోప్ కమ్యూనిటీ చిల్డ్రన్ హోమ్ ఫర్ గర్ల్స్ అండ్ బాయ్స్, ఇమ్మానియేల్ గ్రేస్ పబ్లిక్ స్కూల్ గదులను గజపతినగరం సివిల్ కోర్ట్



జడ్జి ఎ.విజయ్ రాజ్ కుమార్ పరిశీలించారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో గల ఆశ కిరణ్ చిల్డ్రన్ హోమ్ ఫర్ గర్ల్స్ అండ్ బాయ్స్ హాస్టల్స్‌ను పరిశీలించారు. ఏ విషయంలోనైనా విద్యార్థులకు అవసరమైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

పెన్షన్లు పంపిణీలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: దేశంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియలో ఆంధ్ర రాష్ట్రమే తొలి స్థానమని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. దుప్పాడ, అయ్యన్నపేట, ఉడా కాలనీ ప్రాంతాలలో పలువురికి పింఛన్లను అందజేసి యోగక్షేమాలని అడిగి తెలుసుకున్నారు. వృద్ధాప్య, వితంతువు లకు చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం 4000 రూపాయలను అందజేస్తున్నారని అన్నారు. అలాగే వికలాంగులకు 6000 రూపాయలు, కిడ్నీ బాధితులకు, ఇతర తీవ్ర రోగగ్రస్తులకు 15000 రూపాయలు పింఛన్లుగా అందజేయడం గొప్ప విషయమని ఘాటించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య, 43వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి, పలువురు తెదెపా నాయకులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని శివరామరాజుపేట పంచాయతీ బాలకృష్ణరాజపురం గ్రామంలో పెన్షన్స్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఒక్కొక్కటి పూర్తి చేస్తున్నామని, అన్న క్యాంటీన్ల విషయంలో జగన్మోహన్ రెడ్డి పేదల కడుపు కొట్టారని, ఆ విషయం కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 204 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి 2,25,000 మంది కడుపు నింపుతున్నామని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రతి ఇంటికి తాగు నీటి కుళాయి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వబ్బిన సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలే కూటమి ధ్యేయం

ఎమ్మెల్యే కళా వెంకటరావు

విశాలాంధ్ర - మెరకముడిదాం: పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. శనివారం గర్భాం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.2,000 ఉన్న పెన్షన్‌ని రూ.3,000 పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని, ఏటా రూ.250 పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారని ఆయన విమర్శించారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే పెన్షన్ రూ.4,000 చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, నాయకులు కోట్ల వెంకటేశ్వరరావు నాయుడు, తాడ్డి చంద్రశేఖర్, కెంగువ ధనుంజయ, వి.సన్యాసి నాయుడు, మండల బీజేపీ అధ్యక్షులు రాము నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఆర్.కృష్ణవేణి, ఎంపీడీఓ జి.భాస్కర్ రావు, ఈఓపీఆర్డీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మార్క్ ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

విశాలాంధ్ర - భోగాపురం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మార్క్ ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు అన్నారు. యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ సందర్భంగా "యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ - హెల్త్" నినాదంతో ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన విశాఖలో యోగా దినోత్సవం నిర్వహించనున్న సంగతి తెలిసిందే. యోగాంధ్ర 2025 క్యాంపెయిన్లో భాగంగా ఎంపిడిఓ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో మండల అధికారులు, ఉద్యోగులు, మండల పరిషత్ కార్యాలయం నుండి స్థానిక ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. మార్క్ ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యోగ శిక్షకులు అధికారులు, ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు. యోగ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించారు. యోగ మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప వరమని, యోగ మన జీవితంలో భాగం కావాలని అన్నారు.

అక్రమ మోటార్లు తొలగింపు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామంలో త్రాగునీరు ఇబ్బందులు మహాప్రభో అంటూ శనివారం విశాలాంధ్ర దినపత్రికలో వెలువడిన వార్తకు స్పందించిన పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి టి.కన్నం నాయుడులు స్పందించారు. ఆ మేరకు శనివారం గ్రామంలోని వీధుల్లో రక్షిత మంచినీటి పథకం పైపులైన్లకు అమర్చిన మోటార్లను తొలగించారు. ఇకపై రక్షిత మంచినీటి పథకం పైపులకు ఎవరైనా మోటార్లను అమర్చి నీరు కాజేస్తే ప్రభుత్వం ఉన్నతాధికారుల అనుమతులతో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి టి.కన్నం నాయుడు మాట్లాడుతూ గ్రామంలో మండల పరిషత్ నిధులు 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నీరు అందించేందుకు డైరెక్ట్ పంపింగ్ ఏర్పాటు చేసి బోరుబావి తవ్వించగా బోరుబావి తవ్విన చోట లూజు సాయిల్ అవ్వడంతో బోరు బావి రంధ్రం మట్టితో కూరుకుపోవడం వలన నీరు అందలేదని, అలాగే పంచాయతీ తీర్మానం చేసి 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మరో బోరుబావి తవ్వించడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సూచనలతో మరో మూడు రోజుల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులకు త్రాగునీరు సదుపాయం కల్పిస్తామని పంచాయతీ కార్యదర్శి కన్నంనాయుడు తెలిపారు.

17వ వార్డు సమస్యలపై వినతి

విశాలాంధ్ర - రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు అమ్మవారి కోలనీ 3వ లైన్‌లో రోడ్లు, కాలువలు సమస్య గురించి రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహన్‌కి వినతి అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు టీడీపీ సీనియర్ నాయకులు మరిపి జగన్మోహన్, గంధి గోపి, మెంటాడ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షణీయంగా యోగా చిత్రాలు

విశాలాంధ్ర - విజయనగరం: యోగా పట్ల ప్రజలకు మరింత చైతన్యం కలిగించే దిశగా నగరపాలక సంస్థ పలు ప్రాంతాలలో యోగా చిత్రాలను చిత్రకారులచే చిత్రీకరించింది. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో నగరంలోని ప్రధాన జంక్షన్లలో యోగా చిత్రాలను చిత్రకారులు రూపుదిద్దుకుంటున్నాయి. మయూరి వద్ద బ్రిడ్జి ప్రాంతంలో యోగా చిత్రాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

భారీ వర్షానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని వావిలపాడు గ్రామంలో సంజీవి మెట్ట కడకండ రోడ్డులో కూమిరెడ్డి కల్లాల సమీపంలో వర్రి సోంబాబు పొలం దగ్గర శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అలాగే బొద్దాం రామస్వామిపేట వెళ్లే రహదారిలో రైల్వే ట్రాక్ సమీపంలో విద్యుత్ స్తంభం నేలకొరగడంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్తు నిలిపి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఆయా గ్రామస్తులు ఏటువంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు తీసుకున్న చొరవకు ఆయా గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

4న వైసీపీ వెన్నుపోటు దినం

విశాలాంధ్ర - మెరకముడిదాం: చీపురుపల్లి నియోజకవర్గం స్థాయిలో జూన్ 4న జరగనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా వైసీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం మెరకముడిదాం మాజీ సర్పంచ్ కె.శివరామకృష్ణ ప్రసాద్ గృహం వద్ద మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట్ల వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పథకం కింద ఇంటిలో 18 సంవత్సరాలు దాటిన ఎంతమంది మహిళలు ఉంటే అంతమందికి నెలకు 15 వందలు చొప్పున ఇస్తామని చెప్పి సంవత్సరం అయిపోయినా ఒక్క పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. అనంతరం వెన్నుపోటు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, బూర్లె నరేష్, కె.శివరామ కృష్ణ ప్రసాద్, పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలను ఎదుర్కోడానికి సన్నద్ధంగా ఉండాలి

ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకూడదు
మూడు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక
జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం: ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే మూడు నెలలపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనడానికి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాఖల వారీగా సన్నద్ధతపై ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకూడదని స్పష్టం చేశారు. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలే కాకుండా, ఒకవేళ ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే, ఆ తరువాత చేపట్టాల్సిన చర్యలపై కూడా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. దీనికోసం అన్ని శాఖలు క్షేత్రస్థాయిలో పర్యటించి, మూడు రోజుల్లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సన్నద్ధతపై ఆర్‌డిఓలు వారానికో సారి తమ డివిజన్‌లో సమీక్ష నిర్వహించి నివేదికను అందించాలని సూచించారు. జిల్లాలో వర్షాల కారణంగా చెరువులకు, కాలువలకు ఎక్కడా గండి పడకుండా చూడాలని, దీనికోసం ముందుగానే వాటిని పరిశీలించి నివేదిక తయారు చేయాలని కలెక్టర్ చెప్పారు. మండల స్థాయిలో ఎంపిడిఓ, తాహసీల్దార్, నీటిపారుదలశాఖ ఏఈలు కమిటీగా ఏర్పాటై, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని అన్ని రోడ్లు, డ్రైన్లను పరిశీలించాలని, లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులను నిర్వహించాలని, దోమలు విజృంభించకుండా చూడాలని ఆదేశించారు. వ్యాధులు విజృంభించ కుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని రకాల మందులను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. వర్షాకాలంలో త్రాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీటి కొరత తలెత్తకూడదని స్పష్టం చేశారు. వర్షాలు, ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, స్థంబాలు నేలకొరగడం, వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం తదితర ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వర్షాలవల్ల ప్రమాదాలు జరగకుండా సిద్ధంగా ఉండటంలో రెవెన్యూ శాఖది కీలక పాత్ర అని అన్నారు. పిడుగుల బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. దీనికోసం విస్తృత ప్రచారం చేయాలన్నారు. కల్వర్టులు, వంతెనల వద్ద నీటి ప్రవాహం వల్ల ప్రమాదాలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, తాళ్లతో బారికేడ్లు కట్టి ప్రజలను హెచ్చరించాలని చెప్పారు. జనాభా నియంత్రణ విధానాన్ని రూపొందించేందుకు ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యిందని చెప్పారు. దీనిలో భాగంగా ప్రశ్నావళిని రూపొందించిందని, క్యూఆర్ కోడ్ ద్వారా ఈ ప్రశ్నాపత్రాన్ని పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లాలో ఈ సర్వేని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఓ పి.బాలాజీ జిల్లా కేంద్రం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్.జీవనరాణి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు తాగడం వలన నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, లివర్ క్యాన్సర్, అనేక రకాలైన జబ్బులు వస్తాయన్నారు. ధూమపానం ఆరోగ్యానికి చేటు అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కె.రాణి, జిల్లా టిబి నివారణ అధికారి డాక్టర్ కుమార్, డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, పిఓఎస్ సిడి డాక్టర్ టీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద యోగాసనాలు

విశాలాంధ్ర - విజయనగరం: యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలో గాంధీ విగ్రహం వద్ద యోగాసనాలు వేసే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు సూచనలు చేశారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి యోగ ప్రక్రియలను వివరిస్తూ కార్యక్రమంలో పాల్గొన్న వారితో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టి పి ఆర్ ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్వయం సహాయక సంఘ మహిళలు, క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. యోగ పట్ల ప్రజలను మరింత చైతన్యపరిచారు.

ఎన్టీఆర్ భరోసా అవ్వా తాతలకు వరం

విశాలాంధ్ర- రాజాం: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అవ్వా తాతలకు వరం లాంటిదని రాజాం 17వ వార్డు టీడీపీ నాయకులు మరిపి జగన్మోహన్రావు అన్నారు. శనివారం రాజాం మున్సిపాలిటీ పరిధి 17వ వార్డులో పలువురు పెన్షన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ను అందజేశారు. జూన్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంధి గోపి, మాధవి సచివాలయ సిబ్బంది బాను తదితరులు పాల్గొన్నారు.

4న టేకు చెట్ల బహిరంగ వేలం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల శృంగవరపుకోట మహిళ వసతి గృహ నిర్మాణ స్థలములో ఆటంకంగా ఉన్న టేకు, ఇతర చెట్లను ప్రభుత్వ అటవీ శాఖ వారి సూచనలతో ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం వేయుటకు నిర్ణయించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు తెలిపారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల శృంగవరపుకోట పేరున రూ.5,000లు ధరావత్తుగా చెల్లించి 4వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో నిర్వహించు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - తెర్లాం: వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ హేమంత్‌కుమార్ అన్నారు. పిడుగులు పడే సమయంలో బహిరంగంగా ఉండటం చాలా ప్రమాదకరం అని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు దూరంగా ఉండాలని, ప్రజలు అందరూ తగు జాగ్రత్తలు తీసుకొని సురక్షితంగా ఉండాలన్నారు.

ఫోక్సో చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఉత్తర్వులు మేరకు విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఫుల్ బాగ్‌లో ఉన్న జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నివారణ నిషేధం నిరోధక చట్టం 2013 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ చట్ట ప్రకారం ఎవరైనా పని ప్రదేశంలో మహిళలపై లైంగిక పరమైన వేధింపులకు గురి చేసిన యెడల వారిపై ఈ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ చట్ట ప్రకారం పనిచేసే ప్రదేశాలు ప్రైవేట్ రంగం, ప్రభుత్వ రంగం, ప్రభుత్వ సంస్థలలో సహా అన్ని పని ప్రదేశాలకు ఇది వర్తిస్తుందన్నారు. పని ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదులు కమిటీ ఏర్పాటు చేయడం, ఫిర్యాదులు దాఖలు చేయడానికి విధి విధానాలు పాటించని వారికి జరిమానాలు విధించడం చట్టం నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ దుకాణాల వద్దే రేషన్: సిఎస్‌డిటి

విశాలాంధ్ర - జామి: ఈనెలనుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ సరుకులను ఆయా రేషన్ దుఖాణాల వద్దే తీసుకోవాలని సిఎస్‌డిటి ఎన్‌విఎస్. మూర్తి తెలిపారు. ఈమేరకు మండలంలోని రేషన్ దుఖాణాల డీలర్లుకు తగిన ఆదేశాలను జారీ చేసారు. గత ప్రభుత్వం రేషన్ సరుకులను డీలర్ వద్దనుంచి కాకుండా ఎండిఎం వాహనాలను ఏర్పాటు చేసి ఇంటింటికి తీసుకువెళ్ళి సరుకులను అందజేసింది. కూటమి ప్రభుత్వం ఎండిఎం ద్వారా సరుఏకులు సరఫరాను పూర్తిగా రద్దు చేసింది. గతంలోని పాత విదానంలోనే రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు సరుకులను అందించాలని నిర్ణయించింది. ఈమేరకు మండలంలోని 37 రేషన్ డిపోలలో మొత్తం17,709 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటిలో తెల్లకార్డులు16,716 ఉండగా ఎఎవై కార్డులు 993 ఉన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు 65 ఏళ్ళ దాటిన వారికి ఇంటికి తీసుకువెళ్ళి రేషన్ ఇవ్వాలని సిఎస్‌డిటి తెలిపారు. 65 ఏళ్ళ దాటిన వారిని గుర్తించగా2,417 కార్డులు ఉన్నాయని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచే రేషన్ దుఖాణాలలో రేషన్ సరుకులు ఇవ్వడం ప్రారంభిస్తారని తెలిపారు.

49 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.4.90 లక్షల జరిమానా

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయ నగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్. తేజ చక్రవర్తి విధించారని జిల్లాఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 49 కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం 49 మందికి రూ.4.90 లక్షలను జరిమానగా విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నారన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి వాసి మృతి

విశాలాంధ్ర - చీపురుపల్లి: విజయనగరంలోని ఫారెస్ట్ కార్యాలయం అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం రాయవలస పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన వప్పల శివ (35) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబం శోక సముద్రంలో మునిగింది. రోజువారీ గానే చీపురుపల్లి నుండి వేరుశెనగకాయల బస్తాలను ఆటోలో విజయనగరం తరలిస్తుండగా అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆటోని నెమ్మది చేయడంతో వెనుక నుండి కారు బలంగా ఢీకొనడంతో ఆటో బోల్తా పడి శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఒక పాప, ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. విజయనగరంలో శవపంచనామా అనంతరం చీపురుపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి మృతదేహాన్ని తరలించి దహన సంస్కారాలు జరిపించారు. ఈ మేరకు విజయనగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు వివరించారు.

5వ రోజు కొనసాగిన యోగాంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - వేపాడ:- మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 5వ రోజు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్. సూర్యనారాయణ అన్నారు. అలాగే జూన్ 3వ తేదీ నుండి గ్రామ సచివాలయం పరిధిలో సచివాల సిబ్బందిచే గ్రామస్తులకు యోగాంధ్ర శిక్షణ నేర్పించడంజరుగుతుందన్నారు. గ్రామంలో ఉత్సాహవంతులు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేసుకోని యోగాంధ్ర శిక్షణకు హాజరవాలన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో జూన్ 18 వరకు యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అలాగే జూన్ 21న యోగా డే సందర్భంగా విశాఖలో జరిగే యోగాంధ్రాడేకు ప్రధానమంత్రి మోదీ హాజరవుతారన్నారు. ఈ యోగాంధ్ర శిక్షణా కార్యక్రమంలో శిక్షణ తీసుకున్న ఉత్సాహవంతులైన గ్రామస్తులు ఆ కార్యక్రమానికి హాజరవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పి.వెంకట్రావు, పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, ఆయుష్ వైద్యాధికారి, పి.హెచ్ సి వైద్యాధికారి,సచివాలయ సిబ్బంది,వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

మింత్రా ఎండ్ ఆఫ్ రీజనల్ సేల్ ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం: భారతదేశంలోని ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాలలో ఒకటైన మింత్రా జూన్ 12 వరకు తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ (ఇ ఓ ఆర్ ఎస్) 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోంది. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదారులు అంతర్జాతీయ, దేశీయ మరియు స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10,000 కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి 4 మిలియన్లకు పైగా స్టైళ్లలో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఒక్కరి అభిరుచి, ట్రెండ్‌కు అనుగుణంగా ఈ సీజన్‌లో వారికి కావలసిన అత్యంత స్టైలిష్ ఎంపికలతో, వారి వార్డ్‌రోబ్‌లు, బ్యూటీ షెల్ఫ్‌లను భర్తీ చేసుకోవాలని కోరుకుంటున్న వారికి వారికి ఇది చివరి గమ్యస్థానం. ఈ ఏడాది ఎండ్ ఆఫ్ రీజనల్ సేల్ సమయంలో వినియోగదారులను ఆకట్టుకునే విభాగాల్లో పురుషుల క్యాజువల్ వేర్, పురుషుల మరియు మహిళల ఎథినిక్ వేర్, మహిళల వెస్ట్రన్ వేర్, బ్యూటీ అండ్ పర్సనల్ కేర్, వాచీలు, వేరబుల్స్, ఉపకరణాలు, ప్రయాణ అవసరాలు, స్పోర్ట్స్ ఫుట్‌వేర్, పిల్లల దుస్తులు మరియు వివాహ సేకరణలు ఉన్నాయి. లెవీస్, నైక్, అడిడాస్, హెచ్‌ఎం, మాంగో, లోరియల్, లాక్మే, లిబాస్, డెకాథ్లాన్, న్యూ బ్యాలెన్స్, క్రోక్స్, యుఎస్ పోలో అసోసియేషన్, ప్యూమా మరియు రేర్ రాబిట్ వంటి అనేక ప్రముఖ బ్రాండ్‌లు అధిక ఆకర్షణను పొందుతాయని భావిస్తున్నారు. బ్రీజీ సిల్హౌట్‌ల నుంచి శక్తివంతమైన స్టేట్‌మెంట్ పీస్‌ల వరకు, ఈ కలెక్షన్‌లు ప్రతి సందర్భం, మూడ్ అలాగే, వ్యక్తిగత శైలికి అనుగుణంగా ఏదో ఒకటి అందిస్తాయి. థ్రిల్‌కు తోడు, ఎఫ్ డబ్ల్యూ డి , మింత్రా జెన్ జెడ్ ప్రతిపాదన, ఎస్ జెడ్ ఎన్, ఫ్రీకిన్స్, బోంకర్స్ కార్నర్, గ్లిట్జ్, అనౌక్ రస్టిక్, లులు %ఉ% స్కై, కె ఆర్ ఓ పి, ఔట్‌షైడర్ వంటి అనేక ఇతర బ్రాండ్‌ల నుంచి 200 కే ప్లస్ కన్నా ఎక్కువ ట్రెండ్-ఫస్ట్ శైలులను కలిగి ఉంటుంది.

విస్తారంగా వర్షాలు: తహశీల్దార్

విశాలాంధ్ర - శృంగవరపుకోట: రానున్న మూడు నెలల కాలంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపద్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని మండల తహసిల్దార్ అరుణకుమారి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పిడుగులు పడతాయని అందువలన ఎవరూ కూడా చెట్టు కింద ఉండవద్దని తెలిపారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో వర్షాలు పడుతున్నాయని దీంతో ప్రజలు వీలైనంత మేరకు ఇళ్లలోనే ఉండాలని అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దన్నారు. ఈ మూడు నెలలు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరా పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు.

పింఛన్లతో అవ్వాతాతలకు ఆర్థికభరోసా

విశాలాంధ్ర - మెంటాడ: ఎన్టీఆర్ భరోసా పథకం అవ్వా తాతలకు వరం లాంటిదని మాజీ పి.ఏ.సి.యస్ అధ్యక్షులు గొర్లె ముసలినాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని అన్ని గ్రామల్లో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ఆదేశాల మేరకు మండల ఆగూరు జి.టి.పేట పిట్టాడ తదితర అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు చేతులు మీదుగా ఫించన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. సీనియర్ నాయకులు గొర్లె ముసలి నాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ భానుమూర్తి, యం.పి.టి.సి రెడ్డి ఎర్రి నాయుడు, యాసరపు రాము నాయుడు, కొల్లు అప్పారావు, బుట్టా గౌరినాయుడు, కొరిపిల్లి అప్పలరాజు, మాజీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ వెన్నెల స్వామి నాయుడు, వడ్డీ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి రేషన్ షాపులు ద్వారా సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జూన్ 1వ తేదీ నుండి రేషన్ దుకాణాల వద్ద రేషన్ సరుకులు పంపిణీ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వుల మేరకు ఆదివారం పట్టణములోని పుర షావుకారు జంక్షన్ వద్ద గల రేషన్ డిపో వద్ద ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభిస్తారని తాసిల్దార్ అరుణ కుమారి ఆదివారం తెలియజేశారు.

ఆరోగ్యానికి అండగా చారిటీ గ్రూప్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పేగు వ్యాధితో బాధపడుతున్న పట్టణానికి చెందిన విజ్జపు బంగారులక్ష్మికి జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ అండగా నిలిచింది. శనివారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద బంగారు లక్ష్మి కుమార్తె శ్రావణికి గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ రూ.50వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పేగు వ్యాధితో బాధపడుతున్న ఆమెకు ఆదివారం శ్రీ సాయి సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేయుటకు డాక్టర్లు నిర్ణయించినట్టు తెలియజేసారు. ఆర్థికంగా వెనుక బడిన కుటుంబం కావడంతో ఆమె చారిటీ గ్రూప్‌ను సంప్రదించినట్లు తెలియజేసారు. చారిటీ గ్రూప్ సభ్యుల సహకారంతో సేకరించిన మొత్తం, ఆపరేషన్ నిమిత్తం రూ.50,000/- బంగారులక్ష్మి కుమార్తె శ్రావణికి శనివారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, ఏ.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు ఉద్యోగుల సేవలు ఎంతో విలువైనవి

ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్మడ్ రిజర్వు విభానికి చెందిన ఆర్.ఎస్.ఐ. సంపతిరావు వెంకట రమణరావు పాత్రుడు, ఎ.ఆర్.ఎస్.ఐ. వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబులు భావన శంకరరావులకు జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం "ఆత్మీయ వీడ్కోలు" పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మడ్ రిజర్వు విభాగం చాలా క్రియాశీలక మైనదని, అటువంటి విభాగంలో సమర్ధవంతంగా, ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ముగ్గురు పోలీసు అధికారులు ఉద్యోగ విరమణ చేయడం జిల్లా పోలీసుశాఖకు తీరని లోటేనన్నారు. మావోయిస్టులు కార్యాకలాపాలను నియంత్రించుటలోను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టుటలో ఎటువంటి రిమార్కులు లేకుండా 35-40 సం.లు పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ బాధ్యతలతోపాటు, కుటుంబ బాధ్యతలను కూడా చక్కగా నిర్వర్తించి, వారి పిల్లలను మంచి విద్యావంతులుగా తీర్చిదిద్ది, వారు ఉన్నత స్థానంలో నిలిచేలా చేసారన్నారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఆర్ఎస్ఐ ఎస్.వి.ఆర్. పాత్రుడు, ఎఆర్ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు మరియు ఎఆర్ హెచ్సీ భావన శంకరరావు దంపతులను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శాలువలతోను, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపిక, సన్మాన పత్రాలను ప్రధానం చేసి, ఘనంగా "ఆత్మీయవీడ్కోలు" పలికారు. అదే విధంగా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జిల్లా ఎస్పీ గిఫ్ట్, చెక్‌లను అందజేసారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్పీ ఎఆర్ జి.నాగేశ్వరరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.కె.చౌదరి, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, టి.శ్రీనివాసరావు, ఆర్.రమేష్ కుమార్, పలువురు ఆర్.ఎస్.ఐ.లు పోలీసు అసోసియేషను అధ్యక్షులు కే.శ్రీనివాసరావు మరియు ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణ ప్రజలు మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. ఎమ్మెల్యే బేబీ నాయన, మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు కౌన్సిల్ సభ్యులు అధికారుల జర్నలిస్టులు సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని అవినీతికి తావు లేకుండా స్వచ్ఛమైన పాలన అందిస్తానని అన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో పలు ప్రాంతాలలోని కాలువలలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి వేస్తున్నారు. జెసిబిలు, బాబ్ కార్టుల సహాయంతోనూ, మరికొన్ని ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య బృందాలతోనూ కాలువలను పరిశుభ్రపరుస్తున్నారు. అయితే కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకు పోవడానికి ప్రజా నిర్లక్ష్యం కొంతవరకు కారణం అన్నది తెలుస్తోంది. దీనిపై కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందిస్తూ ప్రజలు కాలువల్లో వ్యర్థాలను వేయరాదని చెప్పారు. డస్ట్ బిన్నుల విధానాన్ని పాటిస్తూ తమ వద్దకే వచ్చే చెత్త తరలించే వాహనాలకు అంది ఇవ్వాలని చెప్పారు. అలాగే తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసి అందివ్వాలన్నారు. వ్యాపార ప్రాంతాలలో చిరు వ్యాపారులు వ్యర్థాలను కాలువల్లో పారబోస్తున్నారని దీనివల్ల పూడిక అధిక సంఖ్యలో చేరుతున్నట్లు గుర్తించామన్నారు. ఇకనుంచి కాలువల్లో చెత్తలు వేసినట్లయితే అపరాధ రుసుములు విధిస్తామని స్పష్టం చేశారు.